క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పది ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరుస్తున్న అధికారులు

సి.బెళగల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల మొదటి సెట్ ప్రశ్నపత్రాలు సోమవారం సి.బెళగల్‌కు చేరుకున్నాయి. ప్రశ్నపత్రాలను రూట్ అధికారి, గూడూరు ఎంఈఓ సుశీల, అదనపు రూట్ అధికారి, జోహరాపురం జెడ్పీస్కూల్ ఎస్‌ఏ రమణగౌడ్ స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేర్చారు. మండల ప్రశ్నపత్రాల నిర్వహణ అధికారి (కాస్టోడియన్), సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ ఎస్‌ఏ కేశవనాథ్, జాయింట్ కస్టోడియన్ నాగ మణికుమార్, ఎస్‌ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాలకు సంబంధించి మొదటి సెట్ ప్రశ్న పేపర్లను స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బాలరాముడు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వంశీమోహన్, పరీక్షల నిర్వహణ అధికారులు కిష్టన్న, అన్వర్‌బాషా వివరాలను నమోదు చేసుకుని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. వీటిలో తెలుగు పేపర్ నుంచి సోషల్ పేపర్ వరకు వచ్చాయని కాస్టోడియన్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరుబావిని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

గూడూరు: పట్టణంలోని రాజావీధిలో తాగునీటి సమస్యను మున్సిపల్ అధికారులు పరిష్కరించారు. కాలనీ వాసులు నీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో రూ.2 లక్షలతో బోరు వేయించి మోటర్ అమర్చారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎన్ అస్లామ్, బోయ అక్కన్న, మున్సిపల్ అధికారులు బోరుబావిని ప్రారంభించారు. సమస్యను సకాలంలో పరిష్కరించిన పాలక మండలికి రాజావీధి వాసులు ధన్యవాదాలు తెలిపారు.

నేటి నుంచి క్షయ నిర్ధారణ పరీక్షలు

సి.బెళగల్: మండలంలో మంగళవారం నుంచి క్షయ (టీబీ) వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు టీబీ సూపర్‌వైజర్ మహేంద్ర తెలిపారు. జిల్లా క్షయ నివారణ సంఘం, సేవా భారతి కర్నూలు, శ్రీఅశ్విని హాస్పిటల్స్ సౌజన్యంతో టీబీ పరీక్షలు చేస్తామన్నారు. పల్లెల్లో ప్రతి రోజూ సంచార వాహనం ద్వారా ఉచితంగా ఎక్స్‌-రే తీస్తామన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 12వ తేదీ పోలకల్ గ్రామం, 14వ తేదీ సి.బెళగల్, 15న ఇనగండ్ల,18న కొత్తకోట, 19న కంబదహాల్, 21న సంగాల, 22న కొండాపురం గ్రామాల్లో సంచార ఎక్స్ రే వాహనం వస్తుందని తెలిపారు. దీర్ఘకాలిక దగ్గు, బరువు తగ్గటం, ఆకలి లేకపోవడం,ఉమ్మిలో రక్తం తదితర లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నేడు చేయూత కార్యక్రమం

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని మంగళవారం చేయూత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఉదయం 9.30గంటలకు పాణ్యంలోని శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో మొత్తం 2,821 మంది గాను రూ. 5కోట్ల 29లక్షల నిధులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా మెగా చెక్కును అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పాణ్యంలో నూతనంగా నిర్మించిన పలు సీసీ రోడ్డు, డ్రైనేజీ కాల్వలను ప్రారంభిస్తారన్నారు. అదే విధంగా పాణ్యం సచివాలయం-1పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉంటుందన్నారు.

మున్సిపల్ మీట్

గూడూరు: గూడూరు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహిస్తారన్నారు. కౌన్సిలర్లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవం

ఓర్వకల్లు : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శాఖా థాలయ భవనాన్ని మంగళవారం ప్రారంభిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు సోమవారం ఓ ప్రకటలో తెలిపారు. నిరుద్యోగ యువతను దృష్టిలో పెట్టుకొని శిథిలావస్థకు చేరిన పాత భవన స్థానంలో సుమారు రూ.10 లక్షలతో కొత్త భవనాన్ని నిర్మించడం జరిగిందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, గ్రంథాలయ శాఖ అధికారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

అన్ని వార్డులు అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 29, 31వ వార్డులో అభివృద్ధి పనులకు భూమి పూజ



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: నగరంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కల్లూరు అర్బన్ పరిధిలోని 29వ వార్డులోని విజయనగర్ కాలనీ నుంచి వీవీఎస్ ఫంక్షన్ హాల్ వరకు రూ. 1.20 కోట్లతో మెయిన్ డ్రైనేజీ కాలువ పనులు, 31వ వార్డులోని రాఘవేంద్ర నగర్‌లో రూ. 40లక్షలతో, రఘునాథ్ కాంప్లెక్స్ లైన్‌లో రూ.30లక్షలతో డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పాలక సంస్థలో పాలక వర్గం ఏర్పడినప్పటి నుంచి కర్నూలు నగరం అభివృద్ధిలో దూసుకెళ్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఓటమి భయంతో గత ప్రభుత్వాలు నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో నగరపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడంతో పాలక వర్గం ఏర్పడి నగరంలోని సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు చెప్పే అబద్ధపు మాటలు నమ్మి మోసపోవదని సూచించారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను గమనించాలని, న్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు మిద్దె చిట్టెమ్మ, సుదర్శన్‌రెడ్డి, శ్వేతారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, సాన శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

కల్లూరు అర్బన్ 31వ వార్డుకు చెందిన 20 టీడీపీ కుటుంబాలు సోమవారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. స్థానిక కార్పొరేటర్ మిద్దె చిట్టెమ్మ ఆధ్వర్యంలో ఆంజనేయులు గౌడ్, చెన్నయ్య, దావీదు, స్వప్న, లక్ష్మీదేవి, ఫాతిమా బేగంతో పాటు 20 కుటుంబాలకు చెందిన కార్యకర్తలకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వలన మేలు జరిగి ఉంటేనే మద్దతు ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా అడుగుతున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, నాయకులు తిరుపాల్, భాస్కర్ రెడ్డి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించండి



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల ను గుర్తించాలని పాణ్యం నియోజకవర్గ ఆర్‌ఓ/జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం అసెంబ్లీ పరిధిలోని ఏఈఆర్‌ఓలు, సెక్టోరియల్, పోలీసు సెక్టోరియల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల్లో జరిగిన గొడవలు, ప్రలోభాలు, మత, రాజకీయపరమైన ఘటనలు, ఫిర్యాదులు, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం తదితరఅ అంశాలను పరిశీలించి ఇంకా ఏవైనా సమస్మాతక పోలింగ్ స్టేషన్‌లు ఉంటే గుర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ భావన, ఓర్వకల్లు, కల్లూరు, పాణ్యం తహసీల్దార్లు నగరాజు, మునివేలు, ఫణికుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు అన్ని విధాల సహకరిస్తాం



ఆదిమూలపు సతీష్‌ను సత్కరిస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): కోడుమూరు శాసనసభ నియోజక వర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి పూర్తి సహకారం అందిస్తామని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం నియోజక వర్గం సమన్వయకర్త ఆదిమూలపు సతీష్ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ను కర్నూలులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో దుండగుల దుశ్చర్య

పాణ్యం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం -7లో దుండగులు వీరంగం సృష్టించారు. సోమవారం ఉదయం సిబ్బంది కేంద్రాన్ని శుభ్రం చేసుకునేందుకు రాగా కేంద్రం తలుపులు బద్దలుకొట్టి ఉండటం గమనించారు. తలుపు గొళ్లెంను వంచి, విద్యుత్ మీటర్‌ను, అందుబాటులో ఉన్న ఇటుక రాళ్లతో తలుపులు ధ్వంసం చేశారు. ఈ విషయంపై అంగ న్‌వాడీ సిబ్బంది పోలీసులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు సురక్ష వైద్య శిబిరం

సి.బెళగల్: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా మంగళవారం బ్రాహ్మణదొడ్డి గ్రామ సచివాలయ పరిధిలోని మారందొడ్డి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రామస్తులు ఉచిత వైద్య సేవ లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీజేపీతో పొత్తుపై బాబు సమాధానం చెప్పాలి

కర్నూలు(అర్బన్): ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవడంపై టీడీపీ అధినేత చంద్రబాబు ముస్లింలకు సమాధానం చెప్పాలని ముస్లిం మైనారిటీ రైట్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ షేక్ మహబూబ్ బాషా కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మైనారిటీలకు అమలవుతున్న నాలుగు శాతం రిజర్వేషన్, వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ, దుల్హన్ పథకం అమలుపై చంద్రబాబు స్పష్టత ఇవ్వాలన్నారు. బీజేపీతో తెలుగుదేశం పార్టీ పొత్తు పెట్టుకోవడంపై ముస్లింలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా తాము ముస్లిం మైనారిటీల హక్కుల సాధనకు ఉద్యమిస్తున్నామన్నారు. ఇప్పటికే ముస్లింల హక్కుల సాధనకు కర్నూలు, ఆదోని, నంద్యాల ప్రాంతాల్లో గర్జన నిర్వహించామన్నారు.

భక్తిశ్రద్ధలతో భోగేశ్వరుడి వసంతోత్సవం



భోగేశ్వరుడికి కోనేరులో వసంతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



అలయ ప్రాంగణంలో భోగేశ్వరుడిని హుండీ లెక్కిస్తున్న దృశ్యం

- ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

గడివేముల: శ్రీ దుర్గాభోగేశ్వరుడి ఆలయంలో గత నాలుగు రోజుల నుంచి జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు సోమవారం వసంతోత్సవంతో ముగిశాయి. స్వామివారికి ఉదయం తిరుమంజన ము, నాకబలి, వసంతోత్సవం, ప్రత్యేక పూజలను ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ అధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రధాన కోనేరులో స్వామివారికి అవబృంత స్నానము చే యించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి సాయంత్రం గడిగరేవుల గ్రామంలో గ్రామో త్సవం, పారువేట కార్యక్రమం నిర్వహించారు.

పెరిగిన భోగేశ్వరుడి హుండీ ఆదాయం

శ్రీ దుర్గాభోగేశ్వరస్వామి హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలు, టికెట్లు, తాత్కాలిక దుకాణాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కగట్టారు. గతేడాది కంటే ఈ ఏడాది ఆదాయం పెరి నట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. గత శివరాత్రికి రూ.2,98,362 రాగా ఈ సంవత్సరం రూ. 3,64,731 రావడంతో రూ.66,369 అదనంగా ఆదా యం వచ్చిందన్నారు. హుండీ లెక్కింపును సీఎఫ్‌ఓ పీసీ సంపత్ కుమార్, పర్యవేక్షణాధికారి గోపీ పర్యవేక్షించారు. కార్యక్రమంలో చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి, ఈఓ చంద్రశేఖరరెడ్డి, ధర్మకర్తలు శివుడు, కుమారి, సురేంద్రనాథ్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, సులోచన పాల్గొన్నారు.



గని గ్రామంలో నూతనంగా నిర్మించిన పాఠశాల అదనపు గదులు

ప్రారంభానికి సిద్ధం

- రూ.22 కోట్లతో గని గ్రామంలో అభివృద్ధి పనులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామంలో రూ.22 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు ఆర్బీకే, వెస్సార్‌హెల్త్ సెంటర్లను మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఉపసర్పంచ్ శివానందరెడ్డి సోమవారం తెలిపారు. గ్రామంలో పొలాల రస్తాలు, సీసీ రోడ్లు, మంచినీటి ట్యాంకు, ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదులు, స్కూల్ కాంపౌండ్ వంటి పనుల శిలాఫలకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించనున్నారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ

స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శివరామిరెడ్డి సోమవారం తెలిపారు. మండలస్థాయి ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గని ఆర్బీకే



ముస్తాబైన గని వైఎస్సార్ హెల్త్ సెంటర్

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

- కోడుమూరులో మూడోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తాం
- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సతీష్
- కోడుమూరులో సచివాలయం, హెల్త్ క్లీనిక్, ఆర్‌బీకే ప్రారంభం



హెల్త్ క్లీనిక్, ఆర్‌బీకే శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న హర్షవర్ధన్, ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయాలు, వలంటర్ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం సాకారమైందని.. ప్రజల ముంగిటకే సేవలు అందుతున్నాయని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ అన్నారు. సోమవారం సాయంత్రం కోడుమూరులో గ్రామ సచివాలయం-3, రైతు భరోసా కేంద్రం-4, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్-2లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావులేకుండా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ఐదేళ్ల పాలనలో జగనన్న ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సేవలను సొంత ఊర్లలోనే అందజేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులే తమను గెలిపిస్తాయని, ముచ్చటగా మూడోసారి కోడుమూరు కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు కానుకగా అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఢీకొనే ధైర్యం లేక చంద్రబాబు బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకున్నారని, బాబు ఎంత మందితో వచ్చినా ప్రజలు చిత్తుచిత్తుగా ఓడిస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపిస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ రూతమ్మ, మండల ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, మాధవి, సర్పంచ్‌లు భాగ్యరత్న, శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ దివ్య, ఏఓ రవిప్రకాష్, ఏఈ గంగరాజు, సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కొంతలపాడు శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగార్జున, సోమన్న, రవికుమార్‌రెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

బాబు అంటే మోసం.. జగనన్న అంటే నమ్మకం



మహిళలకు చెక్కును అందిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: ఎన్నికల సందర్భంగా జగనన్న మహిళల సంక్షేమం కోసం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేశారని, చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల్లో మహిళల రుణాలు మాఫీ చేస్తానని మోసం చేశారని, జగనన్న అంటే జనాలకు నమ్మకం...చంద్రబాబు అంటేనే మోసమని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్, కూడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని పసుపుల గ్రామం సమీపంలోని యూబీఆర్ ఫంక్షన్ హాలులో వైఎస్సార్ చేయూత నాల్గవ విడత సంబరాలు సూర్యోదయం మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. నాల్గో విడత కింద 5794 మంది మహిళలకు రూ.10.31 కోట్ల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జడ్పీటీసీ ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహిమియా, మండల కన్వీనర్ మహబూబ్ బాషా, మాజీ వైస్ ఎంపీపీ డి.వాసు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, గూడూరు జెడ్పీటీసీ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఎద్దుల బండలాగు పోటీలు హోరాహోరీగా సాగాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామ రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పాలపళ్ల విభాగపు పోటీలను స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ రామకృష్ణ ప్రారంభించారు. పోటీలలో రాష్ట్రంలోని కర్నూలు, వైఎస్సార్ జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి మొత్తం 15 ఎడ్ల జతలు పాల్గొన్నట్లు రైతు సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తెలిపారు. పోటీల్లో విజేతలకు దాతల సహకారంతో నగదు బహుమతిని అందజేశారు. కర్నూలు మండలం, పి రుద్రవరం వృషభాలు తొలి స్థానంలో నిలిచి రూ.50 వేలు కైవసం చేసుకున్నాయి. దీనరపల్లె చిన్న వీరన్న యాదవ్ ఎద్దులు రెండవ స్థానంలో రూ.40 వేలు, అలకొండ మునిరంగడు యాదవ్, అముకతాడు రామచంద్రుడు(ఉభయ జత) వృషభాలు మూడో స్థానంలో, ఓర్వకల్లు మండలం, ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సుధాకర్ ఎడ్లు సమాన స్థానం సాధించగా రూ.25 వేలను ప్రదానం చేశారు. అలాగే దేమలికండ్ల ఖాశీంవలి, జడదొడ్డి జానకి రాముడు (విడిజత)వృషభాలు ఐదవ స్థానంలో రూ.15 వేలు, ఆరవ స్థానంలో ఎండీ సద్దాం ఉశేన్ ఎద్దులకు రూ.10 వేలు, ఏడవ స్థానంలో నిలిచిన ఏ.కోడూరుకు చెందిన సీఎస్‌ఆర్ బుల్స్ వృషభాలకు రూ.8 వేలు, చివరి ఎనిమిదవ స్థానం సాధించిన కలుగొట్ల రమేష్ నాయుడు, ధరూర్ వేమారెడ్డి వృషభాలకు రూ.5 వేల చొప్పున బహుమతులను అందజేశారు. ఈ పోటీలకు శేఖర్‌రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. విజేతలైన వృషభాలకు సాయంత్రం ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు జీకే వెంగన్న, కొమరోలు నాగశేషులు, కాల్వ సర్పంచు పెద్ద వెంకటేశ్వర్లు, నూర్ అహ్మద్, కాటినేని రమణ తదితరులు పాల్గొన్నారు.

విన్నారు.. చేశారు!

- కాంట్రాక్ట్ ఆరోగ్య సిబ్బందిని రెగ్యులర్ చేసిన సీఎం వైఎస్ జగన్
- కాంట్రాక్ట్ సిబ్బంది కుటుంబాల్లో సంతోషాలు

గడివేముల: ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆవేదన విన్నారు. అధికారంలోకి వచ్చాక శాశ్వత పరిష్కారం చూపుతానని హామీనిచ్చారు. ఆ మాట నిలబెట్టుకోవడంలో భాగంగా కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేయడంతో సిబ్బంది 23ఏళ్ల నిరీక్షణ ఫలించింది. వారికి తీపి కబురునందిస్తూ ప్రభుత్వం జీఓ 30 (పేస్కేల్ 2022 ప్రకారం రూ.32670-101970) విడుదల చేయడంతో వారి కుటుంబాల్లో సంతోషాలకు అవధుల్లేవు.తమ జీవితాల్లో ఆనందం నింపారని భావోద్వేగానికి గురయ్యారు. జీవితాంతం సీఎం జగన్ కు రుణపడి ఉంటామని పేర్కొంటున్నారు.

కోర్టు కేసు పేరిట టీడీపీ ప్రభుత్వం తప్పించుకుంది..

2014 ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి రాగానే ముఖం చాటేశాడు. టీడీపీ ప్రభుత్వం న్యాయస్థానంలో కేసుల పేరిట కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేసింది. విషయాన్ని పలుమార్లు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు దృష్టికి కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.

ఉద్యోగ భద్రత శుభపరిణామం



2003 మే నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నా.గత ప్రభుత్వాలు మమ్మల్ని పట్టించుకోలేదు. క్రమబద్ధీకరణతో వైద్య సిబ్బంది కుటుంబాల్లో సంతోషం నింపింది. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాకుటుంబం జీవితాంతం రుణపడి ఉంటాం.

– మాల గౌరయ్య, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్, గడివేముల

సీఎం నిర్ణయం వరం



వైద్యశాఖలో మే 2003 నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నా. జీతాలు అరకొరగా వస్తుండటంతో పాటు చాలా ఇబ్బందులు పడేవాళ్లం. మా కష్టాల గురించి గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి కలిసినప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు గత ఏడాది రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించడం సంతోషం కలిగించింది. ఈ రోజు మమ్మల్ని రెగ్యులర్ చేస్తూ జీఓ విడుదల చేయడం పట్టలేని ఆనందంగా ఉంది. ఆయనకు రుణపడి ఉంటాం. – కాట్రావత్ జగపతి నాయక్, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్, గడివేముల

22 ఏళ్ల నిరీక్షణ ఫలించింది



2002 ఆగస్టు నుంచి కాంట్రాక్ట్ పద్ధతిన ఫార్మాసిస్టుగా పనిచేస్తున్నా. ఇన్నాళ్లు పేరుకు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నా మాకు ఎలాంటి మేల జరగలేదు.అయినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అరకొర జీతాలతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి మేలుతో మా కల నెరవేరి ంది. గురువారం క్రమబద్ధీకరిస్తూ జీఓ విడుదల చేయడంతో సీఎం మాట తప్పడని మరోసారి రుజువు చేశారు.

–బేరి రాజ్‌కుమార్,ఫార్మాసిస్ట్, గడివేముల పీహెచ్‌సీ

సంటెన్న కుటుంబానికి ఎమ్మెల్యే సంతాపం

పాణ్యం: పాణ్యం గ్రామానికి చెందిన జాతీయ స్థాయి మాజీ అథ్లెటిక్ క్రీడాకారుడు సంటెన్న మృతిచెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోమవారం ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. అలాగే పాణ్యం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, పాణ్యం ఉపసర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి సంటెన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మరోసారి వాయిదా

గూడూరు: నగర పంచాయతీకి సంబంధించిన వేలాలు మరోసారి వాయిదా పడినట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకరరెడ్డి సోమవారం తెలిపారు. వారపు సంత, పెద్ద పశువుల కమేలా, పెద్ద పశువుల మార్కెట్‌కు నిర్వహించిన వేలాలకు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.110 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.